

చిలుకూరు ఆలయంలో పంచాంగం వినిపిస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్, హాజరైన భక్తులు




విశ్వావసు.. విజయోస్తు

తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని ఆదివారం జిల్లావ్యాప్తంగా ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటిలో షడ్రుచులతో ఉగాది పచ్చడి చేసి పిల్లలు, పెద్దలు పంచుకున్నారు. పూర్ణాలు, భక్ష్యాలను తయారు చేసుకొని ఆరగించారు. సాయంత్రం దేవాలయాలలో అర్చకులు పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా

ఈద్ ముబారక్

రంజాన్ పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకునేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఉన్న ఈద్గాలు ముస్తాబయ్యాయి. ప్రార్థనలు చేసుకునేందుకు వాటిని శుభ్రం చేయించి శోభాయమానంగా అలంకరించారు. అలాగే మసీద్‌లు రంగురంగుల విద్యుత్ దీపాల మధ్య జిగేల్‌మంటున్నాయి. పండుగ సందర్భంగా కొత్త డ్రెస్సులు, ఇతర సామగ్రి కొనుగోలు చేయడంలో ముస్లింలు నిమగ్నమయ్యారు. దీంతో దుకాణ సముదాయాలు కిక్కిరిసిపోయాయి. ఆమనగల్లు, మార్చి30(ఆంధ్రజ్యోతి):



ఆమనగల్లు పట్టణంలో ప్రార్థనలకు సిద్ధం చేసిన ఈద్గా

ఆమనగల్లులో విద్యుత్ కాంతులీనుతున్న హైమదే హిలాల్ మజీద్



అన్నివర్గాల ప్రజలు సుభిక్షంగా ఉంటారు

- చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్ రూరల్, మార్చి30(ఆంధ్రజ్యోతి): తెలుగు ఉగాది విశ్వావసు సంవత్సరంలో రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి చెందుతారని, సకాలంలో వర్షాలు కురుస్తాయని రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకుడు సీఎస్.రంగరాజన్ తెలిపారు. ఉగాది పంచంగాన్ని ఆయన ఆదివారం రాత్రి ఆలయంలో భక్తులకు చదివి వినిపించారు. ఈ ఏడాదిలో వివాహాలు ఎక్కువ జరిగే అవకాశం ఉందని, ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారన్నారు. కార్యక్రమంలో గోపాల కృష్ణ పంతులు, పవన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు. చిలుకూరు ఆలయ బ్రహోత్సవాలు ఏప్రిల్ 7వ తేది నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

- డ్రైవర్‌తో సహా 10మంది ప్రయాణికులకు గాయాలు
- కొత్తూర్ బైపాస్ వద్ద ప్రమాదం

8



మరో చాన్స్..!

మేజర్ అయితే కొత్త ఓటరుగా నమోదుకు అవకాశం

- ఏప్రిల్ ఒకటో తేదీకి 18 ఏళ్లు నిండితే చాలు
- దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించిన ఎన్నికల సంఘం
- పేరు, పుట్టిన తేదీ, అడ్రస్ సవరణ చేసుకోవచ్చు
- ఫారం -7 ద్వారా మైగ్రేటెడ్, రెండుచోట్ల



ఓటు హక్కు సామాన్యుని చేతిలో ఉన్న వజ్రాయుధం. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఓటు హక్కును రాజ్యాంగం ప్రసాదించింది. అయితే నూతన ఓటరు నమోదును నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. గతలో ఏడాదికి ఒకసారి మాత్రమే ఈ అవకాశం ఉండేది. కానీ ప్రతీ సంవత్సరం జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబరు ఒకటో తేది నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఏప్రిల్ 1 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. దీంతో జిల్లాలో రానున్న స్థానిక ఎన్నికల వరకు ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.



రంగారెడ్డి అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కొత్త ఓటరు నమోదుకు గతంలో ఎన్నికల సంఘం జనవరి 1వ తేదీకి 18 ఏళ్లు నిండిన వారికి మాత్రమే అవకాశం కల్పించేది. కానీ ఇప్పుడు ప్రతిఏటా నాలుగు సార్లు జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబరు ఒకటో తేదీల నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఓటు హక్కు నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించింది. అయితే ఈ ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరు నమోదుకు అర్హులు. ఫారం-6 ద్వారా 18 ఏళ్లు నిండిన యువతి, యువకులు కొత్తగా ఓటు నమోదు చేసుకునే ప్రక్రియ రేపటి నుంచి (మంగళవారం) ప్రారంభం కానుంది. అలాగే స్థానికంగా లేని ఓటర్ల పేర్లను తొలగించేందుకు ఫారం-7ను ఉపయోగించవచ్చు. వలస వెళ్లిన వారు (మైగ్రేడెడ్) రెండు చోట్ల పేరున్న వారు, చనిపోయిన వారి పేర్లను తొలగించేందుకు కూడా ఫారం 7ను ఉపయోగిస్తారు. ఫారం 8 ద్వారా ఓటరు పేరు, పుట్టిన తేది, అడ్రస్‌ను సవరించుకోవచ్చు. అలాగే ఓటు హక్కును ఒక పోలింగ్ సెంటర్ నుంచి మరో పోలింగ్ కేంద్రానికి ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో మాత్రమే కాకుండా ఆఫ్‌లైన్‌లో కూడా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఎన్నికల సంఘం కల్పిస్తుంది. ఆఫ్‌లైన్‌లో స్థానిక బీఎల్‌వో, తహసీల్దారు కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో...

అన్ని ఫారంలను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ కోసం అందుబాటులో ఉంచారు. అర్హత కలిగిన యువతీ యువకులు మొదట ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలి. వెబ్‌సైట్‌లో చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్

మిగతా 8వ పేజీలో...

సర్వమతాల సారాంశం ఒక్కటే..



ఇఫ్తార్ విందులో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

మంచాల, మార్చి 30(ఆంధ్రజ్యోతి): సర్వమతాల సారాంశం ఒక్కటేనని, ప్రతి ఒక్కరిలో భగవంతుడున్నాడనే విషయం గమనించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పేర్కొన్నారు. ఆదివారం జాపాల గ్రామంలో సీపీఎం నాయకుడు ఓరుగంటి భాస్కర్‌గౌడ్ ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా సీపీఎం కార్యదర్శి పి.యాదయ్య, మండల కార్యదర్శి రావుల జంగన్న, నాయకులు జగన్, పాపిరెడ్డి, అబ్బాస్ తదితరులున్నారు.

రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం

రూ.5 లక్షల ఆస్తినష్టం

ఆమనగల్లు , మార్చి 30(ఆంధ్రజ్యోతి) : ఆమనగల్లు మున్సిపాలిటీ విఠాయిపల్లి వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి పక్కన ఉన్న చైత్ర ఫ్యామిలీ రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ముర్తోజుపల్లి గ్రామానికి చెందిన హోటల్ నిర్వాహకుడు చాట్ల శ్రీను ఉగాది పండుగ నేపథ్యంలో సాయంత్రం హోటల్‌ను త్వరగా మూసివేసి ఇంటికి వెళ్లాడు. రాత్రి 7.30 గంటల సమయంలో రేకుల షెడ్‌లో నిర్వహిస్తున్న రెస్టారెంట్ నుంచి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. అది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐలు వెంకటేష్, సీతారాంరెడ్డి, పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. బోరు మోటర్ సహాయంతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. గంట తరువాత కల్వకుర్తి నుంచి అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను పూర్తిగా ఆర్పింది. అప్పటికే రెస్టారెంట్ ముందు భాగం పూర్తిగా కాలిపోయింది. ఫర్నిచర్, వంట సామగ్రి, ఫాల్ సీలింగ్, ఇతర వస్తువులు దగ్ధమయ్యాయి. అగ్నిప్రమాదంలో సుమారు రూ.5లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు హోటల్ నిర్వాహకుడు తెలిపారు. ప్రమాదానికి షార్ట్‌సర్క్యూట్ కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు.



ఎగిసి పడుతున్న మంటలు



చివరికి జీవాలకు మేతాయె..!

యాచారం మండలంలోని నందివనపర్తి గ్రామంలో వరి పంటలకు నీరందక ఎండిపోతున్నాయి. చేసేదేమీలేక రైతులు జీవాలను మేపుతున్నారు. గ్రామానికి చెందిన గౌర మల్లయ్య మూడు ఎకరాలలో వరి సాగు చేశాడు. పెట్టుబడి కోసం రూ.లక్ష వరకు అప్పు చేశాడు. రెండు బోరుబావుల నుంచి చుక్కనీరు రాకపోవడంతో పంటంతా ఎండిపోయింది. దీంతో పొలంలో జీవాలను మేపుతున్నాడు. పంట సాగు కోసం చేసిన అప్పు ఎలా తీర్చాలని రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. పంట నష్టానికి పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

- యాచారం, మార్చి 30(ఆంధ్రజ్యోతి)

సాయిరెడ్డి చెరువుకు కొత్తకళ!

పునరుద్ధరణకు సర్వే పనులు షురూ

- దత్తత తీసుకున్న అమేజాన్ సంస్థ
- 300మిలియన్ లీటర్ల నీటిని నింపేలా డిజైన్
- రెండేళ్లలో పూర్తిచేసేలా ప్రభుత్వంతో ఒప్పందం
- హర్షం వ్యక్తం చేస్తున్న కొత్తూరు ప్రాంత ప్రజలు



సాయిరెడ్డి చెరువు

కొత్తూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికంగా ప్రత్యేక గుర్తింపు పొందిన కొత్తూర్‌లో పలు రకాల రసాయనాలతో భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయి. దీంతో సాగు నీటితో పాటు తాగు నీటికి స్థానిక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ కలుషిత నీటిని వినియోగించడంతో ఓ వైపు పంటలు పాడవుతుండగా, మరోవైపు ప్రజలు సైతం వ్యాధుల బారిన పడుతున్నారు. అయినప్పటికీ కొత్తూరు మండలంలో పలు చెరువులు, కుంటలు కబ్జాలకు గురవుతూనే ఉన్నాయి. ఒకప్పుడు కళకళలాడిన సాయిరెడ్డి చెరువు నేడు చెత్త డంపింగ్‌కు అడ్డాగా మారింది. నీరు లేక పూర్తిగా ఎండిపోయి కళాహీనంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులు, కుంటలను ప్రక్షాళన చేసి, వర్షపు నీటిని నిల్వ ఉంచేందుకు పూడిక తీత పనుల కోసం కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌లో భాగంగా దిగ్గజ సంస్థ అమేజాన్ ముందుకు వచ్చి సాయిరెడ్డి చెరువును దత్తత తీసుకుంది. ఇరిగేషన్ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఈ ప్రాజెక్ట్ పనులు ముందుకు కొనసాగనున్నాయి. ఇందుకు గాను రాష్ట్ర ప్రభుత్వంతో అమేజాన్ సంస్థ ఒప్పందం చేసుకుంది. ఈ నేపథ్యంలో మరో రెండెళ్లలో సాయిరెడ్డి చెరువు రూపురేఖలు మారనున్నాయి. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే భూగర్భజలాలు పెరిగి ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారే అవకాశం ఉంది.

33 ఎకరాల విస్తీర్ణంలో..

సాయిరెడ్డి చెరువు కొత్తూర్ మున్సిపాలిటీకి అతి సమీపంలో ఉంది. ఈ చెరువు శిఖం మొత్తం 33 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో కొంత పట్టా భూమి ఉండగా, ప్రభుత్వ

మిగతా 8వ పేజీలో...



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, పటేల్‌కిరణ్ తదితరులు

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

తాండూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): తాండూరులోని శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఆలయ ప్రాంగణంలో వీరశైవ సంఘం ప్రతినిధులు, భద్రేశ్వర దేవస్థానం పాలకమండలి సభ్యులతో కలిసి ఆర్‌బీఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉత్సవాలు ఏప్రిల్ 15 నుంచి 20వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పటేల్ కిరణ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కరణం పురుషోత్తంరావు, డాక్టర్ సంపత్‌కుమార్, మాజీకౌన్సిలర్ బంటారం లావణ్య, వీరశైవ సమాజం ప్రతినిధులు జొన్నల బస్వరాజ్, వాలి శాంత్‌కుమార్, మోత్కుపల్లి చంద్రశేఖర్, ఆలయ ఈవో శేఖర్‌గౌడ్, ప్రసారం బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక కార్యక్రమాల్లో ముందుండాలి

మొయినాబాద్ రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినప్పుడే వారికి భవిష్యత్తులో మంచి గుర్తింపు లభిస్తుందని టీపీసీసీ అధికారప్రతినిధి గౌరిసతీష్, చేవెళ్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొండ్ల నిరంజన్‌గౌడ్‌లు పేర్కొన్నారు. నగరంలోని ఏవీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు నక్కలపల్లి గ్రామంలో వారం రోజులపాటు చేపట్టిన సేవాకార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు గ్రామాల్లో ప్రజల సమస్యలను గుర్తించి వారికి న్యాయమైన సేవలను అందించేందుకు ఇలాంటి ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాజుగౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, నీలకంఠం, శ్రీకాంత్‌రెడ్డి, అంజయ్యగౌడ్, మల్లేష్, హరీష్ చారి, నర్సింహులు, గౌరి మధు, అర్జున్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఇంటింటికీ వెళ్లి వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థినులు



నక్కలపల్లిలో ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు

సుభాన్‌పూర్‌లో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

మహేశ్వరం : హైదరాబాద్ బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మహేశ్వరం మండలం సుభాన్‌పూర్ గ్రామంలో చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలు ఆదివారం నాలుగోరోజుకు చేరాయి. ఈ సందర్భంగా విద్యార్థినులు గ్రామంలో పచ్చదనం పరిశుభ్రత, పర్యావరణాన్ని కాపాడడంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మాజీ సర్పంచ్ పద్మాపాండు మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థినులు తమ గ్రామంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు సుభాన్‌పూర్, దిలావర్‌గూడ గ్రామాల్లో సైబర్‌నేరాలు, మహిళల భద్రత, లోన్‌యాప్, సోషల్‌మీడియా దుష్ప్రచారంపై అవగాహన కల్పించారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ

చౌడాపూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): చౌడాపూర్ మండలంలోని మక్త వెంకటాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద చౌడాపూర్ మండలంలోని మక్త వెంకటాపూర్ గ్రామాన్ని ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం విడతల వారీగా అమలు చేస్తుందని తెలిపారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు అవుతాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేశ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు హన్మంత్ రాథోడ్, వెంకట్, సూర్యనాయక్, హీర్యా, గుండ్యానాయక్, రామారావు, లాలు రాథోడ్, సంతోష్, అభిరామ్, మాసయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

'అగ్నివీర్'కు అబ్దుల్ జబ్బార్ ఎంపిక



పూడూరు, మార్చి 30, (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ శాఖలో విధులు నిర్వహించేందుకు పూడూరు మండలం చెన్‌గోముల్ గ్రామానికి చెందిన అబ్దుల్ జబ్బార్ ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన అబ్దుల్ అజీస్ టీ స్టాల్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పిల్లలను చదివిస్తున్నాడు. ఇదే క్రమంలో అజీస్ పెద్ద కుమారుడు అబ్దుల్‌జబ్బార్ ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో పాల్గొనగా ఎంపికయ్యాడు. తమ కష్టానికి ప్రతిఫలం లభించిందంటూ జబ్బార్ తల్లిదండ్రులుసంతోషం వ్యక్తం చేశారు. గ్రామస్తులు అభినందించారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో సత్యనారాయణరెడ్డి, అజయ్‌ప్రసాద్

బషీరాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మాజీద్‌లో తాండూరు ఎమ్మెల్యే సోదరుడు, కాంగ్రెస్‌పార్టీ మండల ఇన్‌చార్జి బుయ్యని సత్య నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సొసైటీ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఇఫ్తార్‌తో మతసామరస్యం పెరుగుతుందని వారు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో బన్సీలాల్, పకీరహ్మద్, రజాక్, హోటల్ మాజీద్, ఇమామ్, అడ్డ బషీర్ పాల్గొన్నారు.



ఈత.. కావొద్దు గుండెకోత

- సరదా కోసం వెళ్తే ప్రాణాలు హరీ!
- కాపాడే ప్రయత్నంలోనూ మరణాలు
- ప్రతి వేసవిలోనూ ఘటనలు
- పిల్లలపై తల్లిదండ్రుల నిఘా తప్పనిసరి

చేవెళ్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): విభిన్న వాతావరణానికి పెట్టింది పేరు చేవెళ్ల.. ఇక్కడ వర్షాలు, చలి, ఎండ అన్నీ ఎక్కువే.. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం చిన్నారులు, యువకులు, పెద్దలు ఈత కొట్టేందుకు బావులు, చెరువులు, కాల్వలు, కుంటలను ఆశ్రయిస్తుంటారు. నీటి లోతు తెలియక మునిగి విలువైన ప్రాణాలు కోల్పోతున్నారు. విద్యార్థులకు ఒక్కపూట బడులు నడుస్తుండగా మరికొన్ని రోజుల్లో వేసవి సెలవులు రానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు, యువకులు ఈతకు వెళ్లే సందర్భాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందే..

రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

మండు వేసవిలో చిన్నారులు, యువకులు చెరువులు, కుంటలు, కాల్వల్లో, వ్యవసాయ బావుల్లో ఈత కొట్టేందుకు ఆసక్తి చూపుతారు. ఈత మంచి వ్యాయామం. కానీ, ఈత నేర్చుకోకుండా నీటిలోకి దిగడం చాలా ప్రమాదకరం. చిన్నారులు, యువకులందరికీ ఈత రాకపోవడం, ప్రమాదకర ప్రదేశాల్లో హెచ్చరికలు లేకపోవడంతో స్నేహితులతోకలిసి నీటి వనరుల వద్దకు వెళ్లే పిల్లలు, యువకులు ప్రమాదాల అంచనా వేయలేక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ప్రమాదాలకు నిలయమైన వాగులు, కుంటలు, చెరువులు, బావుల వద్ద నీటిపారుదాల శాఖ ఆధ్వర్యంలో బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈత విషయంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తగిన అవగాహన కల్పించాల్సి ఉంది. అలాగే పిల్లల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలి. నిపుణులైన శిక్షకుల పర్యవేక్షణలో మాత్రమే ఈత నేర్పించాలి. నీట మునిగేవారిని కాపాడే ప్రయత్నంలోనూ కొందరు ఈత వచ్చినవారు ప్రాణాలు కోల్పోతున్నారు. అగ్నిమాక, పోలీస్ శాఖ గజ ఈతగాళ్ల సహకారంతో రక్షించే మెళకువలపై అవగాహన కల్పించాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

పిల్లలపై నిఘా తప్పనిసరి

- ప్రస్తుతం పాఠశాలలు ఒకటే పూట కొనసాగుతుండగా, త్వరలో వేసవి సెలవులు రానున్నాయి. దీంతో పిల్లలపై తల్లిదండ్రులు నిఘా పెట్టాలి. ఈత రానికారణంగా గట్టుమీద ఉండేవారు సైతం కాసేపటికి నీటిలో దిగుతుంటారు. ఇదే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈత నేర్పించడం ద్వారా ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకోవచ్చు.
- ఈత విషయంలో పిల్లలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉంది. ఈత నేర్చుకునే సమయంలో పెద్దల పర్యవేక్షణ తప్పనిసరి.
- బావులు, కాల్వలు, చెరువుల్లో ఈత కొట్టేముందు వాటి లోతును ముందుగానే పరిశీలించాలి. ఈత కొట్టే సమయంలో సరదాలు, పందేలు, అత్యుత్సాహం వంటివి వద్దు. అవి ప్రాణాలకే ముప్పు తెస్తాయి. పూర్తిగా ఈత వచ్చే వరకు లోతైన ప్రాంతానికి వెళ్లొద్దు. ఈత నేర్చుకునే సమయంలో ట్యూబులు, బెండ్లు వాడుతున్నప్పటికీ శిక్షకులు లేకుండా నీటిలోకి దిగడం మంచిది కాదు.

ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు



వేసవిలో ఎండ, వేడిమి నుంచి ఉపశమం పొందేందుకు విద్యార్థులు స్నేహితులతో కలిసి దగ్గరలో ఉన్న చెరువులు, వ్యవసాయ బావుల్లో సరదా కోసం ఈతకు వెళ్తారు. ఈత నేర్పించాలను కుంటే శిక్షణకుడి ఆధ్వర్యంలో నేర్పించాలి. సరదా కోసం వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. వేసవిలో పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారో ఓ కంట కనిపెడుతుండాలి.

- భూపాల్ శ్రీధర్, ఇన్‌స్పెక్టర్, చేవెళ్ల

పచ్చని చెట్లకు నిప్పు

బషీరాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్-తాండూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో పెంచిన చెట్లు పలు చోట్ల అగ్నికి ఆహుతవుతున్నాయి. సమీప రైతులు కొందరు పొలాల్లోని చెత్తకు నిప్పుపెడుతుండడంతో చెట్ల అంటుకొని కాలి బూడిదవుతున్నాయి. ఈ విషయమై సంబంధిత గ్రామాల కార్యదర్శులను అడిగితే మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో రైతులు నిప్పు పెడుతున్నారని, చెట్ల వద్ద నిప్పు పెట్టొద్దని సూచించినా వినడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కాశింపూర్‌లో దగ్ధమవుతున్న చెట్లు

నేడే ఈద్ ఉల్ ఫితర్

- రంజాన్ ప్రార్థనలకు ఈద్గాలు, మసీదుల ముస్తాబు

మేడ్చల్ టౌన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి):రంజాన్ మాసం 29 రోజుల ఉపవాస దీక్షలు ఆదివారంతో పూర్తయ్యాయి. నేడు(సోమవారం) ఈద్ ఉల్ ఫితర్ పండుగ జరుపుకుంటున్నట్లు ముస్లిం పెద్దలు, మసీదుల ఇమామ్‌లు ఆదివారం ప్రకటించారు. ఈద్-ఉల్-ఫిత్ర్ ప్రార్థనలు నిర్వహించేందుకు పట్టణాలు, గ్రామాల్లోని మసీదులను ముస్తాబు చేశారు. మేడ్చల్ పట్టణం, అత్వేల్లిలోని ఈద్గాలను శుభ్రం చేయించారు. ప్రార్థనలు నిర్వహించే మసీదుల్లో ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని ముకుంద్ థియేటర్ వద్ద గల ఇద్గాను రంగులు వేయించి మున్సిపల్ సిబ్బందితో ఈద్గా పరిసరాలను శుభ్రం చేయించారు. మేడ్చల్ పట్టణంలో ముస్లింలు ఒకే సమయంలో ఒకే చోట ప్రార్థనలు చేసే వీలు లేకపోవటంతో ప్రార్థనలు నిర్వహించే సమయాన్ని మార్చారు.



రంజాన్ ప్రార్థనల కోసం ముస్తాబు చేస్తున్న మేడ్చల్ పట్టణంలోని ఈద్గా

పట్టణంలో ప్రార్థనల సమయాలివే..

ప్రధానంగా మేడ్చల్‌లోని ఈద్గాలో ఉదయం 8 గంటలకు, జిద షామధార్ దర్గా మసీదులో 8:30 గంటలకు, చెక్‌పోస్టు ఏక్ మినార్ మసీదులో 9 గంటలకు, మేడ్చల్‌లోని పెద్ద మసీదులో 9:30గంటలకు, అత్వెల్లి ఈద్గాలో 8గంటలకు, మసీదులో 9:30గంటలకు ఈదుల్ ఫితర్ ప్రార్థనల కోసం సమయాన్ని నిర్ధారించారు. ఈద్గాల వద్ద ప్రార్థనకు వచ్చే వారి కోసం నిర్వాహకులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేపట్టారు. వేసవి కాలం కావటంతో మసీదులు, ఈద్గాల్లో ఉదయం 10గంటల లోపు ప్రార్థనలు ముగించేలా చర్యలు తీసుకున్నారు.

కిటకిటలాడిన మేడ్చల్ మార్కెట్

రంజాన్ పండుగ సందర్భంగా అవసర పడే వంట సామగ్రి కొనేందుకు ముస్లింలు ఆదివారం పెద్దఎత్తున మేడ్చల్ మార్కెట్‌కు వచ్చారు. దీంతో స్థానిక దుకాణాలు కిటకిటలాడాయి. బట్టల దుకాణాలు, కిరాణ దుకాణాల్లో పెద్దఎత్తున కొనుగోళ్లు జరిగాయి. మేడ్చల్ పట్టణ వాసులే కాకుండా మండలంలోని వివిధ గ్రామాల ముస్లింలు మేడ్చల్ ప్రధాన మార్కెట్‌లో కొనుగోళ్లు జరిపారు.

పోలీసుల బందోబస్తు

రంజాన్ పండుగ సందర్భంగా మసీదుల్లో ఇద్గాల వద్ద నిర్వహించే ఈద్ ఉల్ పితర్ ప్రార్థనల సందర్భంగా మేడ్చల్ పోలీసులు ప్రత్యేకంగా భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ప్రార్థనల వేళకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించిన పోలీసులు మేడ్చల్ పెద్ద మసీదు, ఈద్గాల వద్ద పెద్ద ఎత్తున, భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. పండుగ ప్రార్థనలు నిర్వహించే మసీదుల వద్ద నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు పట్టణ సీఐ సత్యనారాయణ తెలిపారు.



మేడ్చల్ మార్కెట్‌లో సేమియాలు

ఆర్డీవో కార్యాలయంలో వెబ్ సిరీస్ సందడి

వికారాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ ఆర్డీవో కార్యాలయంలో ఆదివారం వెబ్ సిరీస్ సినిమా షూటింగ్ నిర్వహించారు. దీంతో అక్కడ సందడి నెలకొంది. 'చీకట్లో..' అనే వెబ్ సిరీస్ షూట్ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో నటుడు నాగచైతన్య సతీమణి శోభిత ధూళిపాల నటిస్తున్నట్లు తెలిపారు. షూటింగ్ సమయంలో ఆర్డీవో కార్యాలయానికి 'డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కార్యాలయం' అని బోర్డు ఏర్పాటు చేశారు. షూట్‌లో సీనియర్ నటుడు సురేష్ పాల్గొన్నారు.



వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం వద్ద వెబ్ సిరీస్ షూటింగ్

రోడ్డుపై వెళ్తున్న బాలుడి కిడ్నాప్‌నకు యత్నం

- కిడ్నాపర్‌కు దేహశుద్ధి
- పోలీసులకు అప్పగింత



కిడ్నాప్‌నకు యత్నించిన వ్యక్తి

యాలాల, మార్చి 30, (ఆంధ్రజ్యోతి): ఓ బాలుడిని కిడ్నాపర్ పట్టుకుని తీసుకెళ్తుండగా, తండా వాసులు గుర్తించి కిడ్నాపర్‌కు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన ఆదివారం యాలాల మండలంలో చోటు చేసుకుంది. యాలాల ఎస్‌ఐ గిరి, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎన్కెపల్లికి చెందిన పదేళ్ల బాలుడు భానుప్రసాద్‌ను ఓ కిడ్నాపర్ పట్టుకుని లక్ష్మీనారాయణపూర్‌వైపు తీసుకెళుతున్నాడు. మార్గమధ్యలో బాలుడి అరుపులు, కేకలు వినిపించడంతో పేర్కంపల్లి తండావాసులు గమనించి కిడ్నాపర్ పట్టుకున్నారు. బాలుడిని ఎక్కడికి తీసుకెళుతున్నావని వివరాలు అడుగగా, అతడి నుంచి సమాధానం రాలేదు. అంతలోనే బాలుడి తండ్రి మల్లేశ్, కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని తండా వాసులతో కలిసి కిడ్నాపర్‌కు దేహశుద్ధి చేశారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి వారికి అప్పగించారు. అయితే పోలీసుల విచారణలో కిడ్నాపర్ మద్దూరు మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి అని, అతడికి మతిస్థితిమితం లేదని తేలింది. ఇకపై పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని ఈ సందర్భంగా ఎస్‌ఐ పేర్కొన్నారు.

కలారి బృందానికి ఉగాది పురస్కారం

కొడంగల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కొడంగల్‌కు చెందిన కలారి బృందం ఉగాది పురస్కారం అందుకుంది. ప్రాచీన యుద్ధ కళకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు కలారి శిక్షకుడు రమేశ్ అన్నారు. కృషి, పట్టుదల, ఏకాగ్రత ఉంటే సాధించలేనిదేదీ లేదన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.



పురస్కారాన్ని అందుకుంటున్న కొడంగల్ కలారి బృందం

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన నిరంజన్‌రెడ్డి



మంత్రి కోమటిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నిరంజన్‌రెడ్డి, తదితరులు

ఆదిభట్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ, సినిమాటోగ్రఫీ శాఖ మాత్యులు కోమటిరెడ్డి వెంకటొరెడ్డిని టీపీసీసీ సభ్యులు, ఆదిభట్ల మున్సిపల్ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి ఆయన నివాసంలో కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ విశ్వావసు నామ తెలుగు సంవత్సరంలో భగవంతుడి దీవెనలతో రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆయనతోపాటు కాంగ్రెస్ నాయకులు దేంది రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, శివగౌడ్, ధనరాజ్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులపై సీఎం తీరు దారుణం

యాచారం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో ఉపాధ్యాయులను కించపరిచేవిధంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడడం దారుణమని సేవ్ టీచర్స్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బొడ్డు రవి ఆదివారం ప్రకటనలో ఆరోపించారు. ఉపాధ్యాయులను కించపరిచే విధంగా మాట్లాడడం సరికాదన్నారు. ఎలాంటి సెలవులు లేకుండా బోధన చేయడానికి క్యాలండర్ రూపొందిస్తే అందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తమకు 30 సంపాదిత సెలవులున్నాయనే విషయం విస్మరించడం ఆందోళన కలిగిస్తుందని పేర్కొన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిరంతరం పిల్లల శ్రేయస్సు కోసం పాటుపడుతున్నామని తెలిపారు. సెలవుల రోజున సైతం బడికి వచ్చి బోధిస్తున్న సంగతి గుర్తుంచుకోవాలన్నారు. పాఠశాలల్లో కనీస వసతులపై సీఎం దృష్టి సారించకపోవడం విచారకరమని ఆందోళన వ్యక్తం చేశారు.

మాదారం యాదగిరి గౌడ్‌కు ఉగాది పురస్కారం

కడ్తాల్, మార్చి30(ఆంధ్రజ్యోతి): కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ ఆలయ ఉప ప్రధాన అర్చకుడు, తెలంగాణ అర్చక ఉద్యోగుల జేఏసీ ప్రధాన కార్యదర్శి మాదారం యాదగిరి గౌడ్‌కు రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం లభించింది. ఆదివారం రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో రెవెన్యూ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామ్ అయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ పురస్కారాన్ని అందజేశారు. ఉగాది పురస్కారం అందుకున్న యాదగిరిని మైసిగండి ఆలయ ఫౌండర్ ట్రస్టీ రామావత్ సిరోలిపంతూ, ఈవో స్నేహలత, పలువురు అర్చకులు, నాయకులు, మైసిగండి ప్రజలు అభినందించారు.



యాదగిరికి పురస్కారం అందజేస్తున్న శైలజారామ్ అయ్యర్

కరుగుతున్న గుట్టలు



గొట్టిగకలాన్ గ్రామ సమీపంలో మట్టి తరలించడంతో ఒర్రెలా మారిన గుట్ట

బషీరాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పకృతి సంపద కనుమరుగవుతోంది. ఫలితంగా బీడు భూములు, కొండలు, రాళ్ల గుట్టలు కూడా విలువైనవిగా మారుతున్నాయి. అక్రమ తవ్వకాలతో సహజసిద్ధంగా వెలసిన గుట్టలు రోజురోజుకూ కనుమరగవుతున్నాయి. గుట్టలను తవ్వి మట్టిని ఇళ్లు, రోడ్లు, వెచర్లకు తరలిస్తూ వ్యాపారులు, కాంట్రాక్టర్లు సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో ఎక్కడ చూసినా గుట్ట లు, ఎత్తైన అటవీ ప్రదేశాలు కన్పించేవి. ఇప్పుడు బీడు భూములు, అటవీ ప్రదేశాల్లో తవ్వకాలతో ఒర్రెలు, భారీ గుంతలు దర్శనమిస్తున్నాయి. ఇందుకు తార్కాణంగా మైల్వార్, గొట్టిగకలాన్, నీళ్లపల్లి, నవాల్గ తదితర అడవుల ప్రాంతాల్లో గుట్టలు ఇలా కరుగుతున్నాయి!

బసవేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ

కొడంగల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వీరశైవ సమాజం ఆధ్వర్యంలో కొడంగల్‌లో బసవేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆదివారం వీరశైవ సంఘం నాయకులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడు కోహూరు విజయ్‌వర్ధన్ మాట్లాడుతూ.. ఉగాది పర్వదినం నాడు భూమి పూజ చేయడం సంతోషక రంగా ఉందన్నారు. సమాజంలో మనుషులు ఎలా జీవించాలి, స్త్రీ పురుష లింగబేధాలు, కుల మత విబేధాలు లేకుండా జీవించాలని మహాత్మా బసవలింగేశ్వరుడు ఉద్బోధించా డని గుర్తు చేశారు. విగ్రహ ప్రతిష్ఠాపనలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రచార కార్యదర్శి బుక్క విక్రమ్‌కుమార్, కోశాధికారి సూరారం ప్రకాశ్, కొడంగల్ పట్టణ ప్రధాన కార్యదర్శి గడ్డం శేఖర్, యువ సమాజ్ అధ్యక్షుడు తారాపూరం రవి, గంటి సర్వేశ్వర్, బొంరాస్‌పేట్ మండల గౌరవాధ్యక్షుడు జగదీశ్వర్, మద్దూర్ మండల ప్రధాన కార్యదర్శి మల్లేశం, మల్లికార్జున్ పాల్గొన్నారు.



ప్రతిష్ఠాపనకు భూమిపూజ చేస్తున్న వీరశైవ సమాజ్ సంఘం నాయకులు

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చేవెళ్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహం తీర్చేందుకు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు సమితి సభ్యులు అయ్యారి గోపాల చారి, రామగౌడ్, మధుసూదన్, దివకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం చేవెళ్ల మున్సిపాల్ పట్టణ కేంద్రంలో చలివేంద్రాన్ని స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దహార్తిని తీర్చేందుకు ఏటా చలివేద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కృష్టారెడ్డి, కానిస్టేబుల్ రవిగౌడ్, సమితి సభ్యులు మోహన్‌రెడ్డి, వెంకట్‌స్వామి, విజయ్, విఠలయ్య, విఠల్‌రెడ్డి, భాస్కర్, వెంకటేశ్, శంకరయ్య, సతీష్ ఉన్నారు.

యాచారం: మండలంలోని కుర్మిద్ద గ్రామంలో ఆదివారం సీపీఎం నాయకులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు చల్లటి నీటిని అందుబాటులో ఉంచుతామని నాయకులు సురేష్, గోవర్ధన్, సంజీవకుమార్, అంజయ్య, చెన్నయ్య తెలిపారు.



చేవెళ్లలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు



యాచారం: కుర్మిద్దలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్న సీపీఎం నాయకులు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల గ్రామంలో ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ నాయకులు తిరుమణిరాఘవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌రెడ్డి, పద్మాఅనిల్, రాజు, ప్రసాద్, శ్రీశైలం గౌడ్, విష్ణు, అజీజ్, విజయ్, ఆరీఫ్, అబ్బాస్, లక్ష్మణ్, శ్రీరామ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట: మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో దుగ్గి రాచప్ప జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శేఖరప్ప ఆదివారం చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎండీ మక్బుల్, మల్లయ్య, జంగయ్య, మల్లేష్, వెంకటేష్, ఆమేర్, ఉమాపతి, గోపాల్, శ్రీను, పాష, అజాహర్, అశోక్, వజ్రలింగం, ఆంజనేయులు, మూర్తి, శివ, యాదయ్య, నసీర్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

మన్‌కీబాత్ వీక్షించిన బీజేపీ నేతలు



యాచారంలో మన్‌కీబాత్‌ను వీక్షిస్తున్న బీజేపీ కార్యకర్తలు

యాచారం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ నిర్వహిస్తున్న మన్‌కీబాత్ కార్యక్రమాన్ని బీజేపీ కార్యకర్తలు గంటల తరబడి టీవీలకు అంటిపెట్టుకొని తిలకిస్తున్నారు. ఆదివారం జరిగిన మన్‌కీబాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ హిందీలో మాట్లాడుతుండగా మధ్యలో వచ్చే యాడ్స్ సమయంలో కొందరు నాయకులు తెలుగులో తర్జుమా చేసి కార్యకర్తలకు వివరించారు. మన్‌కీబాత్ కార్యక్రమంతో దేశ సమగ్రతకు బీజేపీ చేస్తున్న కార్యకలాపాలను జనం ఆదరిస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు కొప్పు భాషా, పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ అన్నారు. మన్‌కీబాత్ కార్యక్రమాన్ని యాచారం, నందివనపర్తి, మాల్, నందివనపర్తి, చిన్నతూండ్ల, గున్‌గల్, కుర్మిద్ద, తమ్మలోనిగూడ, నల్లవెల్లి గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులు కార్యక్రమం ముగించేదాక తిల కించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నడికూడి కృష్ణ, వన్నవాడ రవీందర్‌రెడ్డి, పున్న శివకుమార్, గొరిగె బీరప్ప, నీలం రమేష్, కాల్లెశ్రీకాంత్, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా భద్రేశ్వరుడి రథచక్రాల పూజ



రథచక్రాలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

తాండూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల చరిత్ర ఉన్న తాండూరు శ్రీ భావిగి భద్రేశ్వరస్వామి రథచక్రాల పూజా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని జాతరకు దేవుని రథచక్రాలు(పయ్యలు) బయటపెట్టి భద్రేశ్వరుడి నామస్మరణ మధ్య పూజ నిర్వహించారు. కాంపౌండ్ నుంచి రథ చక్రాలను భద్రేశ్వరచౌక్ వరకు తీసుకువెళ్లి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌బీవీఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంపత్, భద్రేశ్వరస్వామి ఆలయ రెన్యూవేషన్ కమిటీ చైర్మన్ పటేల్ కిరణ్‌కుమార్, ఈవో శేఖర్‌గౌడ్, సభ్యులు శెట్టి సురేష్, వీరశైవ లింగాయత్ ప్రతినిధులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

145వ రోజుకు చేరిన దీక్షలు

తలకొండపల్లి, మార్చి30(ఆంధ్రజ్యోతి): తెలుగు నూతన సంవత్సరంలోనైన గట్టిప్పలపల్లిని మండలకేంద్రంగా ప్రకటించాలని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. పాలనా సౌలభ్యం కోసం తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు ఆదివారం 145వ రోజుకు చేరాయి. దీక్షల్లో వివిధ పార్టీల నాయకులు, జేఏసీ, ప్రజా సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జేఏసీ, పార్టీల నాయకులు అశోక్‌గౌడ్, అంజనేయులు, వెంకటయ్య, కృష్ణయ్య, చంద్రశేఖర్ రెడ్డి, శరత్‌చంద్ర, పవన్, తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లులో పంచాంగ శ్రవణంలో ప్రజాప్రతినిధులు, స్థానికులు



మొయినాబాద్ రూరల్: హిమాయత్ నగర్‌లో పంచాంగాన్ని చదివి వినిపిస్తున్న అర్చకుడు



షాబాద్: పంచాంగ శ్రవణం చదువుతున్న వేదపండితుడు శ్రీను పంతులు

వైభవంగా ఉగాది వేడుకలు

శ్రీ విశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలికిన ప్రజలు ● ఉగాది పచ్చడి పంపిణీ.. ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు



శంషాబాద్: మధురానగర్ బస్తీలో పచ్చడిని సామూహికంగా తాగుతున్న ఆలయ కమిటీ సభ్యులు



కేశంపేట: ఎక్లాస్‌ఖాన్ పేటలో పంచాంగ శ్రవణంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఊరువాడ శ్రీ విశ్వావసు నామ సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. ఇళ్లను పచ్చటి మామిడి తోరణాలతో అలంకరించి జీవితాల్లో ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలను దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. మట్టి కుండల్లో షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని తయారు చేసి స్వీకరించి ఆస్వాదించారు. సాయంత్రం వేళ గ్రామాల కూడళ్లు, ఆలయాల్లో అర్చకులు, వేద పండితులు పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు తమ జాతకాలను అర్చకులతో చూయించుకొని రాజపూజ్యం, అవమానం, ఆదాయం, ఖర్చు వివరాలు తెలుసుకున్నారు.

\- ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్, మార్చి 30



చేవెళ్ల: హనుమాన్ ఆలయంలో పంచాంగ శ్రవణం



మహేశ్వరంలో పంచాంగ శ్రవణం వింటున్న ప్రజలు



మంచాల: తాళ్లపల్లిగూడలో పంచాంగ శ్రవణం



యాచారం: తాటిపర్తిలో పొలం పనులు ప్రారంభించిన రైతు



కేశంపేట: పాపిరెడ్డిగూడలో పంచాంగ శ్రవణం



చౌదరిగూడ: కొందుర్గులో లక్ష్మీనరసింహ స్వామి పల్లకీ సేవ



కొత్తూర్: ఆంజనేయస్వామి ఆలయంలో..



కందుకూరు: కొత్తగూడలోని రాజరాజేశ్వరీ ఆలయ ఆవరణలో..



కడ్తాల్: మైసిగండిలో పూజలు చేస్తున్న టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

చోరీల నియంత్రణకు కృషి



ఆమనగల్లు సీఐ ప్రమోద్ కుమార్

ఫటా ఫట్

ఆమనగల్లు, మార్చి30(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజా సంబంధాలు మెరుగు పరుచుకోవడం ద్వారా నేరాల నియంత్రణకు కృషి చేస్తున్నాం. చోరీలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్ అన్నారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి ఫటాఫట్'లో పలు విషయాలు పంచుకున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ఎలాంటి కార్యాచరణ అమలు చేస్తున్నారు.

ప్రజా సంబంధాలు మెరుగు పరుచుకోవడం ద్వారా గ్రామాల నుంచి సత్వర సమాచారం పొందుతున్నాం. తద్వారా నేరాలు, వివాదాలు జరుగకముందే అక్కడికి చేరుకొని పరిస్థితి చక్కదిద్దుతున్నాం.

చోరీల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఆమనగల్లు పరిధిలోని గ్రామాల్లో రాత్రి పెట్రోలింగ్ ముమ్మరం చేశాం. రహదారులపై వాహనాల తనిఖీ చేపడుతున్నాం. పాత నేరస్తులు, అనుమానితుల కదలికలపై నిఘా ఉంచాం. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని దుకాణాదారులు, వ్యాపారులకు సూచించాం. ఈ ఏడాది టూ వీలర్ పెట్రోలింగ్ పెంచాం.

రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు?

హైద్రాబాద్ - శ్రీశైలం హైవేపై మేడిగడ్డ గేటు నుంచి సూర్యలక్ష్మి కాటన్ మిల్ వరకు బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించాం. వాహనాల వేగ నియంత్రణకు చర్యలు చేపట్టాం. ప్రమాద సూచిక బోర్డులతో పాటు పలు చోట్ల బారికేడ్స్ ఏర్పాటు చేయించాం. లైసెన్స్ లేకుండా, కెపాసిటీకి మించి ప్రయాణికులను చేరవేస్తున్న వాహనాలను సీజ్ చేస్తున్నాం.

ట్రాఫిక్ నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

మండల కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేశాం. ట్రాఫిక్ రూల్స్‌ను అధిగమించే వాహనాదారులకు జరిమానాలు విధిస్తున్నాం.

ఇటీవల ఏమైనా డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయా?

మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల సర్కిల్ పరిధిలో ఏడు డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశాం. మద్యం సేవించి వాహనాలను నడుపవద్దని డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నాం. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై కేసులు నమోదు చేశాం.

రంజాన్‌కు మసీదులు ముస్తాబు

ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు ● భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీసులు



ఇబ్రహీంపట్నం: ముస్తాబైన ఈద్గా మైదానం



కందుకూరు: విద్యుత్ వెలుగుల్లో కొత్తగూడ మజీద్

ఇబ్రహీంపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రంజాన్ సందర్భంగా సోమవారం ముస్లింల ప్రత్యేక ప్రార్థనలకు మసీదులు ముస్తాబయ్యాయి. ఇబ్రహీంపట్నం చెరువు కట్ట కింద ఉన్న ఈద్గా మైదానం ప్రత్యేకంగా ముస్తాబైంది. వందలాదిగా ముస్లింలు ఉదయమే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనన్నుందున ఆదివారం మున్సిపల్ సిబ్బంది ఈద్గాతోపాటు పరిసరాలను శుభ్రం చేశారు. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల మధ్య ఇబ్రహీంపట్నం వైపున చెరువు కట్టపై వాహనాలను దారి మళ్లించనున్నారు.

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ఈద్గా వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈద్గాను శుభ్రం చేయించి శోభాయమానంగా అలంకరించారు. ఆమనగల్లు పట్టణంలోని జామ మజీద్, మహ్మదీయ మజీద్, హైమదే హిలాలే మజీద్‌లను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆయా మజీద్‌ల అధ్యక్షులు మహ్మద్‌మాసూమ్, గౌస్‌మైనోద్దీన్, ఖాదర్ ఖాద్రీలు, మైనార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. రంజాన్ పర్వదినం నేపథ్యంలో ఆమనగల్లులో ముస్లింలు కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు.

కడ్తాల్: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ముస్లింలు ఈదుల్ ఫితర్ నమాజ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈద్గాల వద్ద నిర్వహించే నమాజ్ కోసం ఏర్పాటు చేశారు. ఈద్గాలను, పరిసరాలను శుభ్రం చేయించారు. వేసవి దృష్ట్యా నమాజ్‌కు వచ్చే వారి కోసం చలువ పందిళ్లు, షామియానాలు ఏర్పాటు చేయడంతోపాటు తాగునీటి వసతి కల్పించారు. మండల కేంద్రంలోని ఈద్గా వద్ద ఉదయం 9 గంటలకు ఈదుల్ ఫితర్ నమాజ్ ప్రారంభమవుతుందని, ప్రతి ఒక్కరూ సకాలంలో హాజరు కావాలని మసీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రాహుఫ్ కోరారు. ఈ కార్యక్రమంలో మసీద్ కమిటీ ఉపాధ్యక్షుడు జావేద్, నాయకులు జహంగీర్‌అలీ, ఈర్షద్, తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్: పట్టణంలోని ఈద్గాల వద్ద మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. షాద్‌నగర్ పట్టణంలోని అతిపెద్ద ఈద్గా మైదానంలో చెత్త చెదారాన్ని శుభ్రపరిచారు. ప్రార్థన సమయంలో ఎలాంటి ఆటంకాలు కలుగకుండా పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు.

శంషాబాద్: శంషాబాద్ ఈద్గా వద్ద పారిశుద్య సిబ్బంది శుభ్రం చేశారు. ఈద్గా పరిసర ప్రాంతాల్లోని ముళ్లచెట్లు తొలగించారు. ఈ ప్రాంతంలో భద్రతా ఏర్పాట్లను ఆర్జీఐఏ పోలీస్ ఇన్‌స్పెక్టర్ బాలరాజు పరిశీలించారు.

కందుకూరు: కందుకూరు మండలంలోని కొత్తగూడలోని మజీద్‌ను ముస్లిం రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు.

ముస్లింలకు తోఫా పంపిణీ



ముస్లింలకు రంజాన్ తోఫా అందిస్తున్న మాజీ సర్పంచ్ రూప్లానాయక్

కేశంపేట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముస్లింలకు రంజాన్ తోఫా ప్రకటించారు. రంజాన్‌కు ముందు రోజు తోఫాలు అందించాలని కాంగ్రెస్ నాయకులను ఆదేశించారు. దీంతో మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మాజీ సర్పంచ్ రూప్లానాయక్ తోఫాలను తీసుకువచ్చి ఆదివారం ముస్లింలకు అందించారు. ఎమ్మెల్యే శంకర్ అన్ని వర్గాలను సమానంగా చూస్తారని చెప్పారు. కార్యక్రమంలో అంజయ్య, కుమార్‌యాదవ్, వెంకటయ్య యాదవ్, గణేష్, ఖాజా, అంజనేయులు, యాదగిరి చారి, ఎండీ ఖాదర్ భాషా తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

లారీని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

డ్రైవర్‌తో సహా పది మంది ప్రయాణికులకు గాయాలు

కొత్తూర్ బైపాస్ వద్ద ఘటన

కొత్తూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై జేపీ దర్గా చౌరస్తా వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌తో సహా పది మంది ప్రయాణికులు గాయపడ్డారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు కథనం ప్రకారం.. కడప జిల్లా బద్వేల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ శ్రీనివాస్(40) బస్సులో ఇరుక్కుపోవడంతో రెండు కాళ్లు విరిగిపోయాయి. డ్రైవర్‌ను బయట తీసేందుకు పోలీసులు నానా తంటాలు పడ్డారు. దాదాపు గంటపాటు శ్రమించి క్రేన్‌ల సహాయంతో బయటకు తీసి అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. బస్సులో ప్రయాణిస్తున్న రాజేందర్, బాలాజీతోపాటు మరో ఏగుగురికి గాయాలయ్యాయి. గాయపడ్డ ప్రయాణికులను శంషాబాద్‌లోని ప్రైవేట్ అసుపత్రులకు తరలించారు. ప్రమాదం జరగడంతో కొద్ది సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మురళీగౌడ్ తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



కుమార్(ఫైల్)

చౌదరిగూడ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కుటుంబ అవసరాల కోసం రోజువారీ ఖర్చుల కోసం చేసిన అప్పులను తీర్చలేక ఆందోళనకు గురైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కొందుర్గు మండల పరిధిలోని ఉత్తరాస్‌పల్లిలో శనివారం చోటుచేసుకుంది. కొందుర్గు ఎస్ఐ రవీందర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరాస్‌పల్లి గ్రామానికి చెందిన మల్ల కుమార్(28) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం ఓ ప్రైవేట్ బస్సును కొనుగోలు చేయడానికి, కుటుంబ అవసరాలకు అప్పు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆందోళనకు గురైన కుమార్ రాత్రి వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన కుమారుడు అప్పుల బాధతోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని, ఎవరిపై ఎలాంటి అనుమానం లేదని మృతుడి తండ్రి మల్ల అంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీందర్ నాయక్ తెలిపారు.

సాయిరెడ్డి చెరువుకు కొత్తకళ!

(ఐదో పేజీ తరువాయి..)

భూమి 25 ఎకరాలకు పైగా ఉంటుంది. ఈ చెరువు కింద దాదాపు 30 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువులోకి వర్షకాలంలో పై ప్రాంతాల నుంచి పాటు కాలువల ద్వారా వర్షపునీరు వచ్చి చేరుతుంది. చెరువు సమీపంలో ఇళ్ల నిర్మాణాలు కూడా ఉన్నాయి.

పెరగనున్న చెరువు ఉపరితలం

కార్పోరేట్ సోషల్ రెస్పాన్స్‌లో భాగంగా సాయిరెడ్డి చెరువును అభివృద్ధి పరిచేందుకు అమేజాన్ సంస్థ ముందుకు వచ్చింది. చెరువు పూడికతీతతో పాటు కట్ట నిర్మాణాన్ని సైతం చేపట్టనుంది. పర్యావరణ సంస్థ సేట్రీస్ సహకారంతో చేపట్టనున్న పునరుద్ధరణలో చెరువు ఉపరితలాన్ని 10 ఎకరాల నుంచి 33 ఎకరాలకు పెంచనున్నారు.

300ఎంఎల్ నీటితో..

సాయిరెడ్డి చెరువులో 300 మిలియన్ లీటర్ల నీటిని నింపేలా పనులను డిజైన్ చేశారు. ప్రస్తుతం బంజరుభూమిగా మారిన చెరువు త్వరలో నీటితో కళకళలాడనుంది. 2027 సంవత్సరం నాటికి సాయిరెడ్డి చెరువు పునరుద్ధరణ పనులను పూర్తి చేసేందుకు అమెజాన్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. కాగా, ఇప్పటికే చెరువులో సర్వే పనులు ప్రారంభమయ్యాయి. సర్వే పూర్తికాగానే పూడికతీత పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

పూడికతీత శుభపరిణామం



సాయిరెడ్డి చెరువు పూడికతీత పనులు చేపట్టడం రైతులకు, స్థానిక పజలకు శుభాపరిణామం. చెరువలో నీరు నిండితే ఈ ప్రాంత రైతులకు ఎంతో మేలు చేకూరనుంది. అలాగే మత్స్యకారులకు మరింత లబ్ధి చేకూరనుంది.

\-రాజునాయక్, రైతు, కొత్తూర్ తండా

భూగర్భ జలాలు పెరుగుతాయి



సాయిరెడ్డి చెరువు పూడికతీత పనులు పూర్తి అయితే స్థానికంగా భూగర్భ జలాలు పెరుగుతాయి. సాగు, తాగు నీటి సమస్య తీరుతుంది. మత్స్యకారులకు కూడా అనుకూలంగా ఉంటుంది.

\-రవీందర్‌రెడ్డి, ఏఈ, నీటిపారుదల శాఖ

మరో చాన్స్!

(ఐదో పేజీ తరువాయి..)

పేరుతో ఉన్న వెబ్‌సైట్ వస్తుంది. దీంతో పైన ఈ రిజిస్ట్రేషన్ కనిపిస్తుంది. దాన్ని క్లిక్ చేస్తే కొత్తగా చేరే వారి కోసం, చేర్పులు, మార్పులు, అభ్యంతరాలకు సంబంధించిన ఫారమ్‌లు కనిపిస్తాయి. కొత్తగా చేరే వారు ఫాం 6పై క్లిక్ చేస్తే ఫాం వస్తుంది. అందులో తమ వివరాలను పొందుపర్చాలి. వివరాలను పొందుపర్చిన తర్వాత తెలుగులో ట్రాన్స్‌లేట్ కోసం ఆప్షన్ కూడా ఉంటుంది. అన్ని వివరాలు జాగ్రత్తగా చూసుకున్న తర్వాత ఫారం పూర్తి చేసి ఫొటోను అప్‌లోడ్ చేయాలి. ఫారం-6 నింపడం పూర్తయిన తర్వాత సేవ్ చేసి ట్రాన్స్‌ఫర్ బటన్ క్లిక్ చేయాలి. ఆ తర్వాత యునిక్యూ అప్లికేషన్ ఐడీ నెంబర్ వస్తుంది. ఆ నంబర్ ద్వారా అప్‌లోడ్ చేసిన దరఖాస్తు స్టేటస్‌ను చూసుకోవచ్చు. ఓటరుగా ఈ రిజిస్ట్రేషన్ చేసిన దరఖాస్తును సంబంధిత తహసీల్దారు డౌన్‌లోడ్ చేసుకుని సమర్పించిన వివరాలపై విచారణ చేస్తారు.

పెరిగిన ఓటర్లు..

2024 అక్టోబరు 29న ప్రకటించిన ముసాయిదా ప్రకారం జిల్లాలో 36,52,446 మంది ఓటర్లు ఉన్నారు. 2025 జనవరి 6వ తేదిన ప్రకటించిన తుది ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 36,63,152 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 18,84,092 మంది, మహిళలు 17,78,627 మంది, ఇతరులు 433 ఓటర్లు ఉన్నారు. ఎన్ఆర్ఐ ఓటర్లు 361 మంది ఉండగా, మొత్తం సర్వీసు ఓటర్లు 615 మంది ఉన్నారు.



ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియగా చేపడుతుండటంతో కొత్త ఓటర్ల సంఖ్య పెరుగుతూనే ఉంది. ప్రస్తుతం జిల్లాలో 36,78,460 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 18,90,650 మంది ఉండగా... మహిళా ఓటర్లు 17,87,374 మంది ఉన్నారు. అలాగే థర్డ్ జెండర్స్ 436 మంది ఉన్నారు. జనవరిలో విడుదల చేసిన తుది జాబితాను పరిశీలిస్తే.. 15,308 మంది ఓటర్లు పెరిగారు. రానున్న స్థానిక ఎన్నికల వరకు ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.